ఇప్పటికే మొదలైన పనులను.. చేపడతామంటూ వింత ప్రచారం

# బీఆర్ఎస్ అభివృద్ధికి.. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ముసుగు



- ఇప్పటికే శరవేగంగా నిర్మాణంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు
- నగరంలో 9.06 లక్షల మంది ఉచిత మంచినీటి పథకం లబ్ధిదారులు
- ప్రతిపాదనలో ఉన్న మెట్రోకు మ్యానిఫెస్టోలో పొడిగింపు
- నిరుపేదలకు గూడు కల్పిస్తామని ప్రకటించని హస్తం పార్టీ

**నఖల్**

**మార్‌నేకో అఖల్ రహ్‌నా.. అంటే కనీసం నఖలు కొట్టేందుకైనా కాస్త తెలివి ఉండాలి. తెలంగాణ కాంగ్రెస్‌కు అది కూడా లోపించింది. బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టోను కాస్త అటుఇటుగా మార్చి.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోగా ప్రకటించుకోవడమంటే కొంతైనా తెలివి ఉన్నట్లు. కానీ, కండ్ల ముందు జరుగుతున్న పనులను తాము అధికారంలోకి వస్తే చేపడతామంటూ మ్యానిఫెస్టోలో ప్రకటించుకోవడం బహుశా దేశ రాజకీయ చరిత్రలో ఇదే తొలిసారి కావచ్చు. అసెంబ్లీ ఎన్నికల దరిమిలా కాంగ్రెస్ జాతీయ నేతలు.. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మధించి ప్రజల ముందు ఉంచిన మ్యానిఫెస్టోను చూస్తే హస్తం నేతల ధొల్లతనమేందో ఇట్టే అర్థమవుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి సంబంధించి పొందుపరిచిన అంశాలను చూస్తే మ్యానిఫెస్టో రూపకల్పన అనేది ఆలోచన ప్రాతిపదికన కాకుండా.. నగరంలో కారులో తిరుగుతూ, జరుగుతున్న అభివృద్ధిని మ్యానిఫెస్టోగా రూపొందించినట్లుగానే ఉంది. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఆత్మగౌరవ ప్రతీకగా డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నది. ఇప్పటికే నగరంలో లక్ష పూర్తవగా, మరో లక్ష కూడా నిర్మిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కానీ, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో నగరానికి సంబంధించి డబుల్ బెడ్రూం అని గానీ.. నిరుపేదలకు గూడు కల్పిస్తామని గానీ ఎక్కడా లేదు.**

*- సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ):*

**ఉస్మానియా ఆస్పత్రిని హెరిటేజ్‌గా గుర్తించి.. పూర్తిస్థాయిలో ఆధునీకరించి పూర్వ వైభవాన్ని తీసుకువస్తాం..**

❖ ఉస్మానియా ఆస్పత్రి భవనం అనేది హెరిటేజ్ జాబితాలోనే ఉంది. అంటే మ్యానిఫెస్టో రూపొందించే వారికి కనీసం ఈ చిన్న విషయం కూడా తెల్వదు. ఇక ఆధునీకరణ మాటకొస్తే.. 2011–12లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఉస్మానియా ఆస్పత్రి భవన ఆధునీకరణ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. నమూనా రూపొందించారు. ఆ తర్వాత హెరిటేజ్ భవనమంటూ పర్యావరణ వేత్తలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అంటే.. పాత చింతకాయ పచ్చడినే మళ్లీ చేర్చారు. కాగా, ఇలా మరమ్మతులు కాకుండా పూర్తిగా కొత్త భవనాన్నే నిర్మించేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం 2015లో చర్యలు తీసుకుంది. న్యాయస్థానాల్లో కేసు ఉండటంతో అందులో జాప్యం జరుగుతోంది.

**నాలుగు అధునాతన మెటర్నిటీ, వెటర్నరీ, రెండు అధునాతన ఈఎన్‌టీ, రెండు అధునాతన సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రులను నిర్మిస్తాం.**

❖ నోటికి ఏదొస్తే అది మాట్లాడటం.. తోచింది మ్యానిఫెస్టోలో పెట్టడమంటే ఇదే. వాస్తవానికి నగరంలో నలువైపులా నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తామని గతంలోనే సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటికే గచ్చిబౌలిలో టిమ్స్ ఉంది. మిగిలిన మూడింటి నిర్మాణాలు హెలిప్యాడ్ సహా శరవేగంగా సాగుతున్నాయి. మరి కొత్తగా కాంగ్రెస్ తెచ్చేదేందో వారికే తెలియాలి. ముఖ్యంగా ఒక్కో విభాగానికి ఒక్కో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అనేది మతిలేని వాదన. పైగా ఈఎన్‌టీ అంటేనే అందులో కంటికి సంబంధించిన విభాగం ఉంటుంది. అయినా, ఈఎన్‌టీతో పాటు ప్రత్యేకంగా కంటికి రెండు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణమేందో మ్యానిఫెస్టో రూపొందించిన వారికే తెలియాలి.

**హెచ్ఎండీఏ పరిధిలోని మురికివాడల సమగ్ర అభివృద్ధికి స్లమ్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తాం..**

❖ నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు.! అన్నట్లు ఉంది. స్లమ్స్ (మురికివాడలు) నగరాల్లో ఉంటాయి. అంటే జీహెచ్ఎంసీ పరిధిలో ఉంటాయి. మరి హెచ్ఎండీఏ అంటే అటు భువనగిరి, ఇటు యాచారం, మరోవైపు సంగారెడ్డి.. ఇలా సుదూరంగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో మురికివాడలు ఎలా ఉంటాయి.? అలాంటప్పుడు హెచ్ఎండీఏలో స్లమ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏందో.?!

**నగరాల్లో మోడరన్ మల్టీపర్పస్ పార్కులు ఏర్పాటు చేస్తాం..**

❖ ఇప్పటికే నగరంలో 75 థీమ్ పార్కులు అందుబాటులోకి వచ్చాయి. కొత్తగా కాంగ్రెస్ వచ్చి చేసేదేందో.?!

**హైదరాబాద్ నగరాన్ని ముంపు రహిత నగరంగా తీర్చిదిద్ది నాలాల ఆధునీకరణ చేపడతాం..**

❖ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 2000 సంవత్సరంలో భారీ ఎత్తున వరద ముంపు అనంతరం కిర్లోస్కర్ కమిటీ వేశారు. అనంతరం 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పదేండ్ల పాటు ఆ కమిటీ సిఫార్సులను పట్టించుకోలేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ సర్కారు వ్యూహాత్మక నాలా అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) కింద రూ.985 కోట్లతో మొదటి విడత పనులు పూర్తి చేసి.. అనేక ప్రాంతాలకు ముంపు నుంచి విముక్తి కల్పించింది. రూ.5135 కోట్లతో రెండో విడత కూడా పనులు మొదలుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందులో కాంగ్రెస్ కొత్తగా చేసేదేముంది?

**గ్రేటర్ హైదరాబాద్ సహా అన్ని నగరాలు, మున్సిపాలిటీల్లో.. ప్రతి ఇంటికి 25వేల లీటర్ల మంచినీటిని ఉచితంగా సరఫరా చేస్తాం..**

❖ ఇప్పటికే నగరంలో ఉచిత మంచినీటి పథకం అమలులో ఉంది. 9.06 లక్షల కుటుంబాలకు నెలకు 20 వేల లీటర్లు ఉచితంగా అందుతున్నాయి. ఇందుకు ప్రతి ఏటా రూ.300 కోట్ల చొప్పున ఇప్పటికే ప్రభుత్వం రూ.900 కోట్లు కూడా ఖర్చు చేసింది. దానినే కాపీ కొట్టి.. 20వేల లీటర్లకు మరో ఐదువేల లీటర్లను జత చేసి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చింది.

**ఎల్బీ నగర్ నుంచి బీహెచ్ఈఎల్ (వయా ఆరాంఘర్-మెహిదీపట్నం-గచ్చిబౌలి) రూట్లలో కొత్త మెట్రో లైన్లను విస్తరింపజేస్తాం..**

❖ ఏదో మ్యానిఫెస్టోలో మెట్రో రైలు అనే పదం ఉండాలనేగానీ.. రానున్న వందేండ్లను దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ 415 కిలోమీటర్ల మెట్రో విస్తరణ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపింది. ఇప్పటికే సర్వే పనులు కూడా మొదలయ్యాయి. దానిలో నుంచే ఒక మార్గాన్ని తీసుకొని కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పెట్టింది. ఎల్బీనగర్ నుంచి ఇప్పటికే మియాపూర్ వరకు మెట్రో ఉంది. విస్తరణ ప్రాజెక్టుల్లో బీహెచ్ఈఎల్ వరకు ఉంది. అయితే, దానిని కాంగ్రెస్ పార్టీ మెహిదీపట్నం మీదుగా ఆరాంఘర్‌కు మళ్లించింది. వాస్తవానికి మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వరకు పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే ఉంది. ఇది ఉండగా.. అక్కడ మెట్రో అవసరమేముంది? అందుకే గతంలోనే ఈ ప్రతిపాదన ఉన్నా.. ఎక్స్‌ప్రెస్ వే ఉన్నందున ఆ మార్గాన్ని ఎంచుకోలేదు.

## నవ్వులు పుట్టిస్తున్న కాంగ్రెస్ మ్యానిఫెస్టో

*మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్*

సిటీబ్యూరో, నవంబర్ 17(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చూసిన ప్రజలు నవ్వుకుంటున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సీఎం కేసీఆర్ తరహా ఆ పార్టీలో ఏ ఒక్క నాయకుడికి విజన్ లేదని తేలిపోయిందన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో మా ప్రభుత్వం దేశంలోనే ఆదర్శ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దినట్లు తలసాని చెప్పారు. అంతేకాదు విశ్వనగరానికి అవసరమైన హంగులను సమకూర్చుతుందని, ఇప్పటికే అనేక అభివృద్ధి పథకాలు ఆచరణలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బృహత్ ప్రణాళికలు ఉన్నాయని, పురోగతిలో పనులను పూర్తి చేస్తామన్నారు. మేం అమలు చేస్తున్న పథకాలనే కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో పెట్టిందే తప్ప.. కొత్తగా ఏమి పెట్టలేదన్నారు. ప్రజల అభివృద్ధి అక్కర్లేదు.. పదవుల పంచాయతీ, కుర్చీల కోసం ఒకరి కాలు ఒకరు లాక్కోవడానికే వారికి సమయం పడుతుందే తప్ప ప్రజలపై ఆరాటం అసలు ఉండదని తలసాని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి విశ్వసనీయత లేదన్నారు. ఎలాగు గెలిచేది లేదు.. కాబట్టే ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజలు అమాయకులేం కాదని, కచ్చితంగా కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

## మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన తూము శ్రీహరి పటేల్



కేపీహెచ్‌బీ కాలనీ: కూకట్‌పల్లి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం మంత్రి కేటీఆర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో మూసాపేటకు చెందిన తూము శ్రీహరి పటేల్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తూము కొండల్‌రావు, సాయిలు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ప్రజలు, పలు పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు ఉన్నారు.



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేశ్, మాలతి దంపతులు, బీజేపీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కత్తుల సుదర్శన్‌రావు

## తెలంగాణ ప్రభుత్వంలోనే దివ్యాంగుల సమస్యలు తొలగిపోయాయి



మల్లాపూర్, నవంబర్ 17: దివ్యాంగుల బాధలు తెలుసుకొని.. వారి సమస్యలు పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె. వాసుదేవ రెడ్డి అన్నారు. ఉప్పల్ అసెంబ్లీ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల బాధలు తెలుసుకొని.. అక్కున చేర్చుకున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. అదే విధంగా.. ఉప్పల్‌లో బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో దివ్యాంగులు గెలిపించుకోవాలన్నారు. రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడ లేని విధంగా దివ్యాంగులకు అత్యధిక పింఛన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ దివ్యాంగులు బండారి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని ఉప్పల్‌లో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీ మణిపాల్‌రెడ్డి, దివ్యాంగుల సంఘం నాయకులు మహ్మద్ మున్నా, వెంకట్, జగదీశ్, యాదగిరి, అంజిమ్, నాగలక్ష్మి, అంకలప్ప, దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సీమాంధ్రులకు అండగా ఉంటాం..

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఎల్బీనగర్ నియోజకవర్గంలో సీమాంధ్రుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్బీనగర్, నవంబర్ 17: సీమాంధ్ర వాసులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం హైకోర్టు కాలనీ రాచప్ప నగర్‌లోని మైదానంలో నరహరిశెట్టి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సీమాంధ్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏ ఒక్క రోజు కూడా.. ఏ ఒక్కరిని కూడా ఇబ్బంది పెట్టకుండా వారిని మనలో ఒకరిగా అక్కున చేర్చుకుని చూసుకున్నామన్నారు. తెలంగాణలో ఉన్నవారంతా మనవారేనని, అందరినీ కంటికిరెప్పలా కాపాడుతున్న తెలంగాణ బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతును ఇచ్చి గెలిపించాలని కోరారు. ఎల్బీనగర్ నియోకవర్గంలో తనను మరోసారి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా సీమాంధ్ర ప్రతినిధులు మాట్లాడుతూ.. కంటికిరెప్పలా కాపాడుతూ అందరిబాగోగులు చూస్తున్న బీఆర్ఎస్ పార్టీకే తమ మద్దతు అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సామ తిరుమల రెడ్డి, రావు తాతాలు, తోట వెంకటేశ్వర్లు, కూర్మారావు, నర్సింహారావు, భాస్కర్‌సాగర్, నరహరిశెట్టి సుమంత్, జగన్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.